క్లుప్తంగా

పోలమ్మ సన్నిధిలో గజ్జెల పూజ



అమ్మవారి సన్నిధిలో నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

తగరపువలస: భారతీయ నటరాజా నృత్య నిలయం కళా బృందం సభ్యులు ఆదివారం చిట్టివలస పోలమ్మతల్లి ఆలయంలో గజ్జెల పూజ నిర్వహించారు. నృత్య ఉపాధ్యాయురాలు బి.దివ్యకుమారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను సంతపేటకు చెందిన అర్చకుడు నేరెళ్ల విశ్వేశ్వరరావు నిర్వహించారు. చిన్నారులు, తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు ఆలయ ఆవరణలో నృత్యం చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



దాకమర్రిలో ప్రచారం నిర్వహిస్తున్న విజయరాంపురం సమితి ప్రతినిధులు

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భీమిలి మండలం దాకమర్రి పంచాయతీలోని దాకమర్రి, అల్లుపేట, కాళ్లవారి కళ్లాల్లో ప్రచారం నిర్వహించారు. భగవద్గీతను బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువని కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు తెలిపారు. గురుపౌర్ణమి ఆరాధ్యుడు కూడా ఆయనేనన్నారు. ప్రచార కార్యక్రమంలో సమితి సభ్యులు ఎస్.శ్రీనివాస్, వి.సురేష్, బి.అప్పలనాయుడు, కె.లక్ష్మి, కె.సంతోష్, లక్ష్మి, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.


ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.వి జయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ హితవు పలికారు. కార్యక్రమంలో ఉమెన్ ఎస్ఐ ప్రమీల, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణానికి వరదలే అడ్డం

- గోస్తనీ నదిపై ముందుకు సాగని పనులు
- ప్రజల కష్టాలు పట్టించుకోని గత పాలకులు
- వంతెన, కాజ్‌వే నిర్మాణానికి చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు



ప్రస్తుతం తాటితూరు వద్ద గోస్తనీ నది దాటడానికి ప్రత్యామ్నాయ మార్గం



గోస్తనీ నదిలో టి.నగరపాలెం వద్ద వరదలకు కొట్టుకుపోయిన మట్టికట్టు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం, తాటితూరు పంచాయతీల వద్ద గోస్తనీ నదిపై వంతెన, కాజ్‌వేల నిర్మాణంలో ఆలస్యానికి అకాల వరదలు ఒక కారణంకాగా పెరిగిన అంచనా వ్యయం మరో కారణమయింది. నదిలో నీటిమట్టం తగ్గిన తర్వాత పెరిగిన అంచనాల వ్యయంతో వీటి నిర్మాణం పూర్తవుతుందని ఆయా పంచాయతీల పాలకవర్గాలు అంటున్నాయి. గత ప్రభుత్వాలకు ఈ రెండు పంచాయతీల్లో నదిపై వంతెన, కాజ్‌వే కట్టాలన్న ఆలోచన లేకపోయినప్పటికీ... ప్రస్తుతం వంతెనల నిర్మాణానికి సుముఖంగా ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల నాయకులు బురద జల్లుతున్నారని ప్రజలు గుర్రుగా ఉన్నారు. తాటితూరు పంచాయతీ జెడ్పీ హైస్కూల్ నుంచి పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీలోని సామియ్యవలస వరకు నదిపై రూ.2 కోట్ల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో కాజ్‌వే నిర్మాణానికి 2022 మార్చిలో, టి.నగరపాలెం పంచాయతీ వద్ద నదిపై రూ.2.98 కోట్ల దివీస్ లేబొరేటరీ సామాజిక సేవా విభాగం నిధులతో వంతెన నిర్మాణానికి 2022 ఫిబ్రవరిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. వీటిలో టి.నగరపాలెం వద్ద వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ నదికి అడ్డంగా వేసిన మట్టి ఇటీవల వరదలకు కొట్టుకుపోయింది. మరో రూ.70 లక్షలు అదనంగా వ్యయం కాగల ఈ వంతెన పనులు వెంటనే ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు ఇటీవల ప్రభుత్వం నోటీసు జారీ చేసింది. పరిపాలన సంబంధిత కారణాల వల్ల తాటితూరు వద్ద నదిపై కాజ్‌వే నిర్మాణం ఆలస్యమయింది. దీనిని కూడా సవరించిన అంచనాలతో నిర్మాణానికి సిద్ధంగా ఉన్నారు.

చిత్తశుద్ధితో వైఎస్సార్‌సీపీ ముందుకు..

టి.నగరపాలెం వద్ద నదిపై వంతెన నిర్మిస్తే ఇక్కడి నుంచి జీవీఎంసీ పరిధిలో ఉన్న తగరపువలస చేరువ అవుతుంది. కేవలం కిలోమీటరు దూరంతోనే చేరుకోవచ్చు. దీంతో జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు. తాటితూరు పంచాయతీ వద్ద నదిపై కాజ్‌వే నిర్మిస్తే భీమిలి, పద్మనాభం మండల పంచాయతీల మధ్య దూరం తగ్గుతుంది. రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు ప్రతీసారి నదిని ప్రమాదకరమైన పరిస్థితుల్లో దాటే ఇబ్బంది ఉండదు. పైగా నదికి అవతల వేములవారి కళ్లాల్లో ఎవరైనా మరణిస్తే తప్పనిసరిగా నీటిలో నుంచే తాటితూరు బీసీ కళ్లాల్లోని శ్మశానవాటికకు తీసుకురావాల్సి వస్తోంది.



తాటితూరులో గోస్తనీ నదిపై కాజ్‌వే నిర్మించనున్న ప్రాంతం

విడ్డూరంగా ప్రతిపక్షాల ఆందోళన



గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి గంటా శ్రీనివాసరావు రాత్రివేళ కొబ్బరికాయ కొట్టి వంతెన మాట మరచిపోయారు. ఇప్పుడు అదే పార్టీ నాయకులు పిల్ల సైనికులతో కలిసి ఆందోళన చేయడం విడ్డూరంగా ఉంది. 7 సార్లు భీమిలికి ప్రాతినిధ్యం వహించిన టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు కాజ్‌వే నిర్మించలేకపోయారు.

– శిరిగుడి సంతోషి, సర్పంచ్ తాటితూరు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే వంతెన సాకారం



తాటితూరులో అయినా, టి.నగరపాలెంలో అయినా గోస్తనీనది దాటే ప్రజల కష్టాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే గుర్తించింది. టీడీపీ హయాంలో నదికి వరదలు వచ్చినప్పుడు ప్రజల కష్టాలు వారు పట్టించుకోలేదు. వరదనీరు తగ్గిన తర్వాత అదనపు అంచనా వ్యయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే వంతెనల నిర్మాణం పూర్తవుతుంది.

– పి.ఛాయా గౌతమి, సర్పంచ్, టి.నగరపాలెం

ఆలయ భూముల కౌలుకు వేలం రేపు

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో రెండు ఆలయాలకు చెందిన భూముల ఫలసాయాన్ని 2023 అక్టోబర్ ఒకటి నుంచి 2026 మార్చి 31 వరకు అనుభవించుటకు కౌలు శిస్తు నిర్ణయించేందుకు ఈ నెల 10న మంగళవారం గ్రామ సచివాలయం వద్ద వేలం పాట నిర్వహించనున్నట్టు ఈవో నానాజీబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణేశ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 217/1లోని 10.80 ఎకరాల మెట్టు, 45/1లోని 1.26 ఎకరాల పల్లం, 45/3లోని 2.46 ఎకరాల పల్లం భూమికి వేలం వేయనున్నట్టు ఆయన తెలిపారు. ఒక్కొక్క విస్తీర్ణానికి ధరావత్తు పైకం రూ.6 వేలు చొప్పున చెల్లించాలలని తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. రామాలయానికి చెందిన సర్వే నంబర్ 228/5లోని 84 సెంట్లు, 62 సెంట్ల విస్తీర్ణానికి 11.30 గంటలకు వేలం వేయనున్నట్టు తెలిపారు. ఒక్కొక్క విస్తీర్ణానికి ధరావత్తు పైకం రూ.1000 చొప్పున చెల్లించాలని తెలిపారు. పాటదారుడు మొదటి ఏడాది శిస్తు వెంటనే చెల్లించాలని తెలిపారు.

విజ్ఞాన్ విహార్ విద్యార్థుల ప్రతిభ



లోకేష్ కుమార్,



ధీరజ్‌నాయుడు,



గుణశేఖర్,



తేజష్

ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన్ విహార్ విద్యాలయం విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల యాజమాన్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 7న నగరంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొనగా గుడిలోవ విజ్ఞాన్ విహార్ విద్యాలయానికి చెందిన లోకేష్ కుమార్, ధీరజ్ నాయుడు, గుణశేఖర్, తేజష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్టులో స్థానం సంపాదించారని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా వీఎస్ కృష్ణ జయంతి



వీఎస్ కృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఏయూ క్యాంపస్: డాక్టర్ వీఎస్ కృష్ణ జయంతి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయం వద్దనున్న ఆయన విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్థశాస్త్రం ప్రత్యేక అంశంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో వీఎస్ కృష్ణ బీఏ పూర్తి చేశారన్నారు. మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసి 1932లో తనకు ఇష్టమైన విద్యా రంగంలో కృష్ణ ప్రస్థానం ప్రారంభించారని గుర్తు చేశారు. ఏయూలో అర్థశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరిన ఆయన యూజీసీ చైర్మన్‌గా సైతం పని చేశారన్నారు. సూపరింటెండెంట్ రాజగోపాల్, లైబ్రరీ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట



చిప్పాడలో శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట వేస్తున్న గ్రామస్తులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం స్థానికులు రాట వేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 25 ఏళ్లపాటు దుర్గాదేవి ఉత్సవ కమిటీ తరఫున నిరాటంకంగా ఉత్సవాలు జరిపించామన్నారు. 26వ ఏట ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

మహిళలకు చీరలు పంపిణీ



మహిళలకు చీరలు అందిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: స్థానిక టీచర్స్ హెల్ప్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ శంకర్ ఫ్యాషన్స్ అధినేత బంక శంకర్ ఆర్థిక సాయంతో రూ.30 వేల విలువైన 50 చీరలు అందించామని తెలిపారు. రోజూ మధ్యాహ్నం నిరాశ్రయులైన వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటితో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు భవిష్యత్‌లో చేపట్టనున్నామని తెలిపారు. కంటుభుక్త ముత్యాలరావు, పత్రి సన్యాసిరావు, శ్యామలాంబ దేవి పాల్గొన్నారు.

10న క్యాంపస్ ఇంటర్వ్యూలు

తగరపువలస: చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాలలో ఈ నెల 10న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల చైర్మన్ బి.నరసింగరావు తెలిపారు. యారియాస్ సంస్థ ద్వారా నిర్వహించే ఇంటర్వ్యూలకు 2015 నుంచి 2023 వరకు బీఏ, బీకాం, బీఎస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెజ్యూమ్ తీసుకురావాలని సూచించారు. వివరాలకు 99493 94591లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ జరజాపు సతీష్ కుమార్ కోరారు.

ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలి



ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్వతి రవి, తదితరులు

బీచ్ రోడ్డు: అమర గాయకుడు ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలని ఘంటసాల కోడలు, కళా ప్రదర్శిని డైరెక్టర్ ఘంటసాల పార్వతి రవి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆర్కే బీచ్‌లో ఘంటసాల విగ్రహానికి ఆమె పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాయకుడిగా, సంగీత దర్శకుడిగా, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 18 నెలలు జైలు శిక్ష అనుభవించిన ఘంటసాల భారతరత్నకు అన్ని విధాలా అర్హుడన్నారు. ఆయన సేవలను గుర్తించి భారతరత్న ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ఎ.ఎస్.జాన్, తదితరులు పాల్గొన్నారు.

తళతళలాడుతున్న భీమిలి బీచ్



ప్రత్యేక పద్ధతిలో బీచ్‌లోని చెత్త తొలగించే ట్రాక్టర్



చెత్త తొలగించడంతో తళతళలాడుతున్న బీచ్

- నూతన వాహనంతో ఎప్పటికప్పుడు చెత్త తొలగింపు

భీమునిపట్నం: భీమిలి బీచ్ ప్రస్తుతం తళతళలాడుతూ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సాధారణంగా ఇక్కడి బీచ్‌లోని ఇసుకలో చెత్తతో పాటు, నల్ల ఇసుక కూడా వుండడంతో పరిసరాలు ఇబ్బందికరంగా ఉండేవి. దీంతో సాయంత్రం వేళ బీచ్‌కు వచ్చే సందర్శకులు ఇసుకలో కూర్చోవడానికి ఆసక్తి చూపేవారు కాదు. ఎప్పటి నుంచో ఈ పరిస్థితి ఇబ్బందికరంగా ఉండేది. ఈ క్రమంలో నెల రోజుల క్రితం తీరంలోని చెత్త తొలగించడానికి ప్రత్యేక యంత్రంతో కూడిన ట్రాక్టర్‌ను జీవీఎంసీ సమకూర్చింది. ఆ వాహనం భీమిలి బీచ్‌లో అన్ని వైపులా తిరుగుతూ చెత్తను తొలగిస్తోంది. ఇసుక కిందన అడుగు లోతుకుపైనే కూరుకుని ఉన్న చెత్తనూ తొలగిస్తోంది. దీంతో బీచ్‌కు వచ్చే సందర్శకులు ఇసుకలో సేదతీరడంతోపాటు పిల్లలతో ఆడుకుంటున్నారు.

మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీ మాజీ సర్పంచ్ అంపా వెంకటేశ్వర్లు (81) వృద్ధాప్యం కారణంగా ఆదివారం మృతి చెందారు. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా పనిచేసిన ఆయన ఇదే సెగ్మెంట్ నుంచి ఎంపీటీసీ సభ్యునిగా కూడా పనిచేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన ఆయన ఉద్యోగరీత్యా ఇక్కడకు వచ్చారు. హెల్త్ సూపర్‌వైజర్‌గా పద్మనాభం మండలం రేవిడి పీహెచ్‌సీలో ఉద్యోగ విరమణ చేసి మజ్జివలసలో స్థిరపడ్డారు. అనంతరం ప్రజాప్రతినిధిగా విధులు నిర్వర్తిస్తూనే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇంటి వద్దే ఉచితంగా వైద్యసేవలు అందించేవారు. మజ్జివలసలో ఈయన భౌతికకాయానికి భీమిలి, పద్మనాభం మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు.

పబ్లిక్ డిమాండ్

రోడ్డు పునరుద్ధరించండి



పీఎం పాలెం చివరి బస్టాప్ వాటర్ ట్యాంకు లైన్‌లో శిథిలమైన సీసీ రోడ్డు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ 6వ వార్డు పీఎం పాలెం చివరి బస్టాప్ వద్ద వాటర్ ట్యాంకు లైన్‌లో సీసీ రోడ్డు శిథిలమైపోయింది. ముక్కలుగా విడిపోయిన రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించండి.

– త్రిపురాన అనంతలక్ష్మి, పీఎం పాలెం.

విద్యుత్ లైట్లు వెలిగించరూ..!



రేవళ్లపాలెం సాయిగణేష్ కాలనీలో వీధిలైట్లు వెలగని ప్రాంతం

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఎదురు రహదారిలో గల రేవళ్లపాలెం సాయిగణేష్ కాలనీ మెయిన్ రోడ్డులో కొన్ని చోట్ల వీధిలైట్లు వెలగడం లేదు. ముఖ్యంగా ఆనంద్ కాస్టెల్ సమీపంలో స్తంభం నంబర్ ఎస్ఎస్ 2/8/ఎమ్‌డీవీ/36/2పి పరిసర ప్రాంతాల్లో లైట్లు వెలగడం లేదు. అలాగే రేవళ్లపాలెం భాస్కరనగర్ లే అవుట్ – 1 దగ్గర కూడా లైట్లు వెలగడం లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కొన్ని చోట్ల ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయించాలి.

– వీఆర్‌కే శర్మ, సాయిగణేష్ కాలనీ, రేవళ్లపాలెం

8 తాగునీటి బోర్లు మంజూరు



స్వతంత్రనగర్‌లో బోరు పని చేస్తున్న సిబ్బంది

మధురవాడ: నివాస ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తొలగించడానికి జీవీఎంసీ అధికారులు ముమ్మర చర్యలు చేపడుతున్నారు. అవసరానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త తాగునీటి బోర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు జీవీఎంసీ 5, 7 వార్డులకు ఈ నెలలో కొత్తగా రూ.12.10 లక్షల వ్యయంతో వివిధ చోట్ల 8 బోర్లు ఏర్పాటు చేస్తున్నట్టు జీవీఎంసీ జోన్ – 2 తాగునీటి విభాగం డీఈ ఎల్.శ్రీహరి చెప్పారు. అలాగే శివశక్తినగర్ రోడ్డులోని కాలనీల్లో ఇటీవల పైప్‌లైన్ల విస్తరణ పనులు కూడా చేపట్టామని తెలిపారు. ఆదివారం స్వతంత్రనగర్, వాంబేకాలనీల్లో హ్యాండ్ బోరు బావుల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇతర చోట్ల ఈ పనులు చేపడతామని తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న మరికొన్ని చోట్ల భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మరిన్ని బోర్లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

హైవేలో కల్వర్టు శిథిలం



హైవేలో సర్వీసు రోడ్డు పక్కన చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం వద్ద శిథిలమైన కల్వర్టు

మధురవాడ: జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం – జాతర మధ్యలో ఉన్న ఓ కల్వర్టు గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టడంతో పూర్తిగా శిథిలమైపోయింది. కల్వర్టు ఇటుకలు, వ్యర్థాలు మురుగునీటి కాలువలో పడిపోవడంతో నీరు ముందుకు సాగడం లేదు. వర్షాలు కురుస్తుండడంతో మురుగు, వర్షం నీరు ఏకమై రోడ్డు మీద ప్రవహిస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. ఈ కల్వర్టు శిథిలమై రెండు నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పేదల ఎదుగుదలకు విద్యే మూలం

సీతంపేట: పేదలు ఎదగాలంటే విద్యే మూలమని, ప్రపంచ బ్యాంకు నిబంధనలకు తలొగ్గి పాఠశాలలను మూయవద్దని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విద్యా రంగ పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సేన అధ్యక్షుడు జె.బి.రాజు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను నాశనం చేసే 117 జీవోను రద్దు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీనం పేరుతో స్కూళ్లు మూసివేయడం విరమించుకోవాలని కోరారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు, రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ ఎల్.వి.ప్రసాదరావు, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు బి.జార్జి తదితరులు పాల్గొన్నారు.